సాక్షి
బాపట్ల

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



ఘనంగా మిలాద్ ఉన్ నబి

ఫిరంగిపురం: మిలాద్ ఉన్ నబి సందర్భంగా వేములూరిపాడు గ్రామంలో శుక్రవారం జెండాను ఊరేగించారు. అనంతరం చెట్టు వద్ద జెండాను ప్రతిష్టించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 32,141 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 51,962 క్యూసెక్కులు వదులుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.



స్వామి వారికి విశేష కల్యాణం,అభిషేకాలు చేశారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులకు సన్మానం మన బాధ్యత

జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి



బాపట్ల: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం అందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం కాపు కల్యాణ మండపంలో జరిగింది. జ్యోతి వెలిగించి వేడుకలను కలెక్టర్ ప్రారంభించారు. 33 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందించి, సన్మానం చేశారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్య జీవన స్థాయిని మార్చేస్తుందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగం అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి ఉపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం అన్నారు. పోతుల సునీత, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సజ్జ హేమలత, బుడా చైర్మన్ సలగాల రాజశేఖర్ బాబు, డీఈవో పురుషోత్తం, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, ఆర్డీఓ పి.గ్లోరియా, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నృసింహస్వామి పవిత్రోత్సవాలు



మంగళగిరి: మంగళాద్రిలో గల శ్రీ లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ఉదయం నిత్య హోమం, ఉక్త హోమం, పూర్ణాహుతి, కుంభజల ప్రోక్షణ, కుంభాభిషేకం, మహదాశీర్వచనం నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి పవిత్రములతో ఆలయ ప్రదక్షిణ అనంతరం గ్రామోత్సవం జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పవిత్రములను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై శ్వేత పుష్పాలంకార రథ గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా భూ వరాహ వ్రతం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి నగర పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై శుక్రవారం భూ వరాహ వ్రతాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనాలతో వ్రతాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం, రుణ విమోచనం, జ్ఞానాభివృద్ధి, సంకల్పసిద్ధి కోసం వరాహ స్వామిని ప్రార్థిస్తూ ఈ వ్రతాన్ని ఆచరిస్తారని పేర్కొన్నారు. సుమారు 150 జంటలు ఈ కార్యక్రమంలో పాల్గొని, వరాహస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన పేర్కొన్నారు.

బొకారో ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం



చీరాల అర్బన్: స్పెషల్ బ్రాంచి పోలీసులు, ఈగల్ టీం సభ్యులు రైలులో నిర్వహించిన తనిఖీల్లో నాలుగు కిలోల గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు... బాపట్ల జిల్లా స్పెషల్ బ్రాంచి-2 ఇన్‌స్పెక్టర్, జిల్లా డాగ్ స్క్వాడ్ బృందం, బాపట్ల టౌన్ పోలీసులు, ఈగల్ టీం బృందం, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా బాపట్లలో బొకారో ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చీరాలలో రైలు ఆగిన తర్వాత గంజాయిని చీరాల జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

చేనేత రంగం పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోతోంది. మరమగ్గాలతో తయారు చేసిన పట్టు చీరలు ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి భారీగా వస్తున్నాయి. దీంతో చేనేత మగ్గంపై తయారు చేసిన పట్టు చీరాలకు గిరాకీ తగ్గుతోంది. పెరిగిన పెట్టుబడులు, కార్మికులకు తగిన కూలీ లేకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో నేతన్నలు మగ్గాలు వదిలేస్తున్నారు. కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు వాపోతున్నారు.

పట్టు కోల్పోతున్న చేనేత

- మరమగ్గాలపై ఇబ్బడిముబ్బడిగా పట్టు చీరల తయారీ
- తక్కువ ధరకే మార్కెట్లో భారీగా విక్రయాలు
- మగ్గంలో తయారు చేసిన పట్టు చీరలకు తగ్గిన గిరాకీ
- వృత్తి వదిలి కూలీ పనులకు చేనేత కార్మికులు



పవర్ లూమ్‌పై తయారైన చీరలు



చేనేత మగ్గంపై చీర నేస్తున్న మహిళ

వేటపాలెం: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చేనేత కేంద్రాలైన చీరాల, జాండ్రపేట, వేటపాలెం, రేపల్లె, భట్టిప్రోలు, కనిగిరి, బేస్తవారిపేట, ఈతముక్కల, వలపర్ల తదితర ప్రాంతాల్లో 10 వేల వరకు చేనేత మగ్గాలు ఉన్నాయి. ఈ రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికిపైగా కార్మికులు జీవనం సాగిస్తున్నారు. మొన్నటి వరకు ఒక వెలుగు వెలిగిన చేనేత మగ్గాలకు పవర్‌లూమ్స్ శాపంగా మారాయి. చేనేత కార్మికుడు మగ్గంపై 5 లేదా 7 రోజులపాటు ఒక చీర బారు నేస్తే పవర్‌లూమ్స్‌లో రోజుకు రెండు చీరల బార్ తయారవుతున్నాయి. చేనేత మగ్గంలో తయారైన చీర కన్నా మరమగ్గంపై తయారైన పట్టు చీరను 30 నుంచి 40 శాతం తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత మగ్గాల వైపు వ్యాపారులు కన్నెత్తి కూడా చూడటం లేదని కార్మికులు వాపోతున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి..

కర్ణాటక, బెంగళూరు, చెన్నైతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పవర్‌లూమ్స్‌లో తయారు చేసిన పట్టు చీరలను తక్కువ ధరలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. పవర్ లూమ్స్‌లో చేనేత రిజర్వేషన్ చట్టం ప్రకారం వంద శాతం పట్టు దారంతో, డిజైన్‌లను తయారు చేయకూడదు. పవర్ లూమ్స్‌లో తయారయ్యే పట్టు చీరలలో 52 శాతానికి మించి జరీ వాడకూడదు. బార్డర్, పల్లూ డిజైన్‌లు చేనేత మగ్గంలో తయారయ్యే వాటిని వాడకూడదన్న నిబంధనలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 11 రకాల డిజైన్‌లను మరమగ్గాలలో తయారు చేయకూడదన్న నిబంధనలతో ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. ఈ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పట్టు చీరలు తయారు చేసి చేనేతలను దెబ్బతీస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాల్సిన హ్యాండ్లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పర్యవేక్షణ కరువైందని కార్మికులు ఆరోపిస్తున్నారు. రిజర్వేషన్ చట్టానికి తూట్లు పొడుస్తూ మరమగ్గాలలో పట్టుచీరల తయారీకి అడ్డు చెప్పకుండా ఉండాలంటీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మాస్టర్ వీవర్ ప్రతి నెలా మామూలు ఇవ్వాలని షరతుల పెట్టి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అరకొరగా ఉన్న మరమగ్గాలు ఇప్పుడు బాగా పెరిగిపోయాయి.

మూత పడుతున్న చేనేత మగ్గాలు..

మరమగ్గాల దెబ్బకు చేనేత మగ్గాలు నష్టాలను చవిచూస్తుండటంతో క్రమంగా మూతపడుతున్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.24 వేలు సాయం అందించేది. కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం పథకానికి తొలి ఏడాది మంగళం పాడింది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని నేతన్నలు జీవనం సాగిస్తున్నారు. తీసుకొన్న వడ్డీ డబ్బులు చెల్లించడానికి, కుటుంబ జీవనం గడవడానికి నేత కార్మికులు వారి వృత్తిని వదిలి బేల్దారీ, రంగులు, ఇతర వ్యవసాయ పనులు, జీడిపరిశ్రమలో పనులకు వెళుతున్నారు.

చట్టాన్ని అమలు చేయాలి



కేంద్ర ప్రభుత్వం చేనేతలకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తేనే చేనేత రంగం మనుగడ సాగిస్తుంది. లేకుంటే ఒకప్పుడు చేతి మగ్గం ఉండేదన్న విషయాన్ని భావితరాలు చెప్పుకోవాల్సి పరిస్థితి ఏర్పడుతుంది. చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ కరువైంది.

– బీరక సురేంద్ర, దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పందిళ్లపల్లి

తప్పని భారీ నష్టం



ఇతర రాష్ట్రాల నుంచి పవర్‌లూమ్స్‌పై నేసిన చీరలను ఈ ప్రాంతానికి తీసుకువచ్చి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీంతో ఇక్కడి చేనేత కార్మికుల ఉపాధి దెబ్బతింటోంది. దీనికి తోడు జిల్లాలోనే మరమగ్గాలను పోటాపోటీగా ఏర్పాటు చేసి చేనేత పరిశ్రమను చావు దెబ్బతీస్తున్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే మగ్గాలను నిర్వహించలేం.

– గుత్తి సదాశివరావు, చేనేత కార్మికుడు, రామన్నపేట

చీరలకు తగ్గిన డిమాండ్



ఇబ్బడిముబ్బడిగా పవర్‌లూమ్స్ చీరలు వస్తున్నాయి. ముడిపట్టు ధరలు విపరీతంగా పెరిగాయి. చేతి మగ్గంపై తయారు చేసిన పట్టుచీరకు డిమాండ్ ఉండడం లేదు. మరమగ్గాలపై తయారు చేసిన పట్టు చీరలు తక్కువ ధరలకు విక్రయిస్తుండటమే ఇందుకు కారణం. చేనేత మగ్గంపై నేసే మాలాంటి వారికి చేద్దామన్నా పని దొరకడం లేదు. దీంతో కార్మికులకు అప్పుల బాధలు తప్పడం లేదు.

– గుత్తి సుబ్బునాగులు, చేనేత కార్మికుడు, దేశాయిపేట

ఆటో డ్రైవర్లకు కష్టాలు



బాపట్ల అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ఆటో డ్రైవర్ల జీవనానికి ముప్పుగా మారిందని కార్మికశక్తి ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గొలపల పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం ఆటోల ర్యాలీ అనంతరం వర్కర్లు పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో మహిళ ఉచిత ప్రయాణం కొంతమేర మంచిదే అయినప్పటికీ ఆటోలనే నమ్ముకుని ఉపాధి పొందుతున్న వర్కర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆటో కార్మికులకు భారంగా మారిన బీమా, ఆర్టీఏ చలానాలు రద్దు చేయాలన్నారు. విపరీతంగా పెరిగిన ఆటో స్పేర్ పార్టుల ధరలపై రాయితీ ఇవ్వాలి. ఆటో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి ఆర్.టి.సి.లో డ్రైవర్లు, కండక్టర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ సలీమాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం 589 అడుగులు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 589.00 అడుగులకు చేరింది. ఇది 309.0570 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,500, ఎడమకాలువకు 7,029, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 32,886, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 52,115 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 52,115 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మరణాలపై వీడని మిస్టరీ



తురకపాలెం గ్రామం

- భయం గుప్పెట్లో తురకపాలెం గ్రామస్తులు
- వ్యాధి నిర్ధారణ చేయలేకపోయిన అధికారులు, ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు / గుంటూరు మెడికల్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామ ప్రజల మరణాలపై మిస్టరీ ఇంకా కొనసాగుతూనే ఉంది. కొద్దిరోజులుగా మీడియాలో వార్తా కథనాలు రావడంతో నిద్రలేచిన అధికార యంత్రాంగం గ్రామానికి కదిలింది. రాష్ట్ర ప్రజాప్రతినిధులు సైతం గ్రామ బాట పట్టారు. మూడు రోజులుగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు చేస్తున్నా.. ప్రజలకు ఆవగింజంత ఆత్మవిశ్వాసాన్ని కల్పించలేకపోతున్నారు. మేమున్నామంటూ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్టేట్‌మెంట్ ఇచ్చినప్పటికీ ప్రజల్లో ఉన్న భయాందోళనలు రవ్వంత కూడా తొలగిపోలేదు. మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయి?ఎక్కడ లోపం జరిగింది ?అనే విషయాలు ఎవరూ తేల్చలేదు. కొన్ని నెలలుగా గ్రామ ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నా, అధికార యంత్రాంగం నిద్రమత్తులో తూలుతుండటంతో గ్రామం వల్లకాడును తలపిస్తోంది.

భిన్న ప్రకటనలతో గందరగోళం

■ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గ్రామాన్ని శుక్రవారం సందర్శించి మీడియాతో మాట్లాడారు. గ్రామంలో 59 మంది రక్తనమూనాలు సేకరించి, పరీక్షలు చేశామని తెలిపారు. ఫలితాలు అనుమానించదగినవిగా లేవని, నార్మల్‌గా ఉన్నాయని చెప్పారు.

■ కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ బర్కోల్డేరియా సూడోమలై అనే బ్యాక్టీరియా వల్ల జ్వరాలు వచ్చి కొందరు మరణించారని, మెలియాయిడోసిస్ అనేది చాలా అరుదైన వ్యాధి అన్నారు. గ్రామంలో ఎవరికీ సరైన అవగాహన లేకపోవడంతో తెలుసుకునేందుకు సమయం పడుతుందన్నారు.

■ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గ్రామస్తులకు రక్త పరీక్షలు చేస్తున్నారని, మెలిడాయిసిస్ బ్యాక్టీరియా ఉన్నట్లు పరీక్ష ఫలితాలు రాలేదన్నారు. ఎలాంటి బ్యాక్టీరియా అనేది ఇంత వరకు అంతుచిక్కలేదని ప్రకటించారు.

మరణాలకు ఎప్పుడు ఫుల్‌స్టాప్ ?

రెండు నెలలుగా గ్రామంలో మరణ మృదంగం మోగుతోంది. రెండు నెలల అనంతరం కళ్లు తెరిచిన ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు మూడు రోజులుగా హడావుడి చేస్తున్నారు. గ్రామ ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని, భరోసాను కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, వ్యాధికి గల కారణాలు, అందుకు అందుబాటులో ఉన్న చికిత్సలు, సదరు చికిత్సలు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు అరకొరగా ఉన్నాయి. వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు తేటతెల్లంగా కనిపించే వరకు తురకపాలెం గ్రామస్తులు నిద్రపోయే పరిస్థితి లేదు. ఒకేరోజు గ్రామంలో ముగ్గురు మూడు రకాల స్టేట్‌మెంట్‌లతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధి అనేది తెలియక మరింత భయాందోళనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

వైద్య ఆరోగ్య శాఖ నిర్లిప్తత

గ్రామంలో ఏదైనా విపత్కర పరిస్థితులు తక్షణ కర్తవ్యంగా జిల్లా వైద్య అధికారులు జరుగుతున్న సంఘటనలపై జిల్లా ఉన్నతాధికారులకు, రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేసి, అప్రమత్తం చేయాల్సి ఉంటుంది. కానీ గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంది. మరణాల గురించి మీడియా వెలుగులోకి తీసుకొచ్చే వరకు చలనం లేదు. విపత్తులు అంచనాలు వేసేందుకు ఐడీఎస్‌పీ విభాగం ప్రత్యేకంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉంది. సదరు విభాగం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుండిపోవడం వల్లే రెండు నెలలుగా గ్రామం వల్లకాడుగా మారింది. గుంటూరు వైద్య కళాశాల ఎస్‌పీఎం వైద్య విభాగం సైతం విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు గ్రామాలకు వెళ్లి వ్యాధులకు కారణాలు, మరణాలకు కారణాలు విశ్లేషించాలి. సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందించి, మరణాలు, వ్యాధుల కట్టడికి కృషి చేయాల్సిన నైతిక బాధ్యత ఉంది. ఎస్‌పీఎం వైద్య విభాగం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించడం వల్లే నేడు ఓ చిన్న గ్రామం రాష్ట్రవ్యాప్తంగా సంచనాలకు నిలయంగా మారింది. లక్షలాది మంది ప్రజల్లో భయాందోళనకు కారణంగా నిలిచింది.

రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన

- వ్యవసాయం దండగా అనే విధంగా చంద్రబాబు తీరు
- 9న రైతు సమస్యలపై ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల సమన్వయకర్త కోన రఘుపతి

బాపట్ల రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున అన్నారు. ఈనెల 9వ తేదీన రైతులకు ఎరువులు సకాలంలో అందించాలని ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసనలతోపాటు అధికారులకు వినతిపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో డాక్టర్ మేరుగ నాగార్జున మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విత్తనం ఎంపిక నుంచి పంట విక్రయించే వరకు అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుని రైతు పక్షపాత ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు అవసరమైన సాంకేతికతను అందించటంతోపాటు అన్ని రకాలైన ఎరువులు వారికి అందుబాటులోకి తెచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఉందన్నారు. మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతుభరోసా కేంద్రాలు అత్యంత శక్తివంతంగా పని చేశాయని గుర్తు చేసుకున్నారు. ఎరువులు ఎంత కావాలో కూడా అంచనాలేని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు రైతులు క్యూలో నిలబడి ఎరువులు కొనుగోలు చేస్తే తప్పేమిటని అనటాన్ని మేరుగ తప్పుబట్టారు. సీఎం చంద్రబాబునాయుడు వ్యవసాయ శాస్త్రవేత్తలా యూరియా వాడితే క్యాన్సర్ వస్తోందని చెప్పటం అటు రైతులను, ఇటు శాస్త్రవేత్తలను అవమానపరిచే విధంగా ఉందన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కాకముందే రూ.12500 రైతులకు ఇస్తామని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.13500 ఇచ్చి మాట నిలుపుకున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట సంగతి అటు ఉంచి రైతులను అగౌరవపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రభుత్వం

బాపట్ల సమన్వయకర్త కోన రఘుపతి

రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల విషయంలో కృత్రిమ కొరత సృష్టిస్తుందని వైఎస్సార్ సీపీ బాపట్ల నమన్వయకర్త కోన రఘుపతి పేర్కొన్నారు. 70 శాతం ప్రభుత్వం, 30 శాతం మార్కెట్‌లో ఎరువులు ఉంటాయని చెప్పిన ప్రభుత్వం బ్లాక్‌మార్కెట్ జరుగుతుంటే చూస్తూ ఊరుకుందని అన్నారు. పిట్టలవానిపాలెంలో 6,200 మంది రైతులు ఉంటే వారికి 24వేల బస్తాలు కావాల్సి ఉండగా 960 బస్తాలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు దొంతిబోయిన సీతారామిరెడ్డి, గవిని కృష్ణమూర్తి, పార్టీ నాయకులు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మండే విజయకుమార్, నక్కా వీరారెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, వడ్డిముక్కల డేవిడ్, చల్లా రామయ్య, నర్రావుల వెంకట్రావు, ఉయ్యూరు లీలాశ్రీనివాస రెడ్డి, పిన్నిబోయిన ప్రసాద్, మోర్ల సముద్రాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ప్రైవేట్ దందా!

- ఆర్టీసీ బస్టాండ్ ఎదురు అడ్డదిడ్డంగా బస్సులు నిలుపుదల
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



ఆర్టీసీ బస్టాండ్ రోడ్డుపై అడ్డంగా ప్రైవేట్ బస్సులు నిలపడంతో నిలిచిన ట్రాఫిక్

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్ వెలుపల రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ దందా యథేచ్ఛగా సాగుతోంది. నడి రోడ్డుపైనే బస్సుల్ని నిలిపి, ప్రయాణికుల్ని ఎక్కించుకుంటున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఆర్టీఏ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా 100పైగా ప్రైవేట్ ట్రావెల్స్ ఉన్నాయి. గుంటూరు నుంచి హైదరాబాద్, బెంగుళూరు, వైజాగ్, చెన్నై, తిరుపతితో అనేక దూర ప్రాంతాలకు బస్సులు నడుస్తున్నాయి. ఈ సమయంలో నిబంధనలు పాటించాల్సిన బస్సు యజమానులు వాటిని బేఖాతరు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో రెండు కిలోమీటర్ల లోపు ఎటువంటి బస్సులు నిలపకూడదని మోటార్ వెహికల్ యాక్ట్ స్పష్టంగా చెబుతోంది. అయితే, దీనిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆర్టీఏ అధికారులపై ఉంది. తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాల్సిన బాధ్యత, ఫోర్స్‌ను రంగంలోకి దించి చర్యలు తీసుకోవాల్సిన కనీస విషయాన్ని వారు మరిచిపోయారు. ప్రస్తుతం ఆర్టీసీ ఉన్నతాధికారులు కూడా ఒక రోజు విధుల్లో ఉంటే.. నాలుగు రోజులు సెలవులో ఉంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏం పట్టించుకుంటారని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది బాహటంగానే విమర్శిస్తున్నారు. పలుమార్లు విన్నవించినప్పటికీ కనీసం మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ (ఎంవీఐ), సిబ్బందిని కేటాయించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

బస్టాండ్ దగ్గర ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల నిలుపుదలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు చేపడతాం. సిబ్బందిని ఏర్పాటు చేసి బస్సులు నిలువకుండా యాక్షన్ తీసుకుంటాం.

–ఎ. అశోక్, సీఐ, ఈస్ట్ ట్రాఫిక్

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రొంపిచర్ల: స్థానిక మార్కెట్ యార్డులోని జీడీసీ ఎంఎస్ ఎరువుల గోదాంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరేపల్లి గ్రామంలోని రైతుసేవా కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. ఎరువులు రైతులకు అమ్మిన వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రియల్ టైంలో అమ్మిన ఎరువులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రసాయన ఎరువుల వివరాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరం లేకుండా యూరియా కొనుగోలు చేసి ఇండ్లలో స్టాక్ చేయవద్దని రైతులకు సూచించారు. గోదాంలోని ఎరువుల బస్తాలకు, స్టాక్ రిజిస్ట్రలతో సరి చూశారు. తనిఖీల్లో ఏడీఏ కె.వి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి శివలలిత, వ్యవసాయ విస్తరణ అధికారులు బ్రహ్మయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతలకు 34,126 క్యూసెక్కులు విడుదల



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువ నున్న పులిచింతల ప్రాజెక్టుకు 34,126 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణ, ఈఈ సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్లును 1.50 మీటర్లు, ఒక క్రస్ట్‌గేటును ఒక మీటర్ ఎత్తు ఎత్తి 25,492 క్యూసెక్కులు, రెండు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం 8,634 క్యూసెక్కులు మొత్తం 34,126 క్యూసెక్కులు దిగువ నున్న పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 75.50 మీటర్లు కాగా 75.50 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 7.080 టీఎంసీలు ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 55.62 మీటర్లకు చేరుకుందన్నారు. ఎగువ నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

వైభవంగా బీచ్ ఫెస్టివల్ నిర్వహణ

అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: బీచ్ ఫెస్టివల్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. నిర్వహణపై అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో శుక్రవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో సూర్యలంక, రామాపురంలో బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దక్షిణ భారత స్థాయిలో బీచ్ క్రీడా పోటీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఫెడ్ లైట్ల మధ్య వాలీ బాల్, ఖోఖో, బాక్సింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడా పోటీలు భారీ స్థాయిలో నిర్వహించాలని చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగలా జరపాలని ఆయన సూచించారు. పర్యాటకుల సౌకర్యార్థం 100 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం తెలుగు సినీ రంగం నుంచి కళాకారులను పిలిపిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యలో సరదాగా ఉండడానికి జబర్దస్త్ బృందాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రసిద్ధ గాయకులతో పాటు సినీ రంగ నటులు, ప్రముఖుల సైతం ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని కలెక్టర్ తెలిపారు. డాన్సర్లు, మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేయాలన్నారు. తీర ప్రాంతంలో బోట్ల ప్రదర్శన, స్పీడ్ బోట్లు, స్పోర్ట్స్ రైడర్స్, గుర్రాలు, ఒంటెలు ప్రదర్శన ఉంచాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. 350 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వేలాదిమంది కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డెప్యూటీ కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లా పర్యటకశాఖ అధికారి నాగిరెడ్డి, ఆర్డీవో గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

సాధారణ స్థాయిలో రక్త పరీక్ష నమూనాలు

- నేడు బ్లడ్ కల్చర్ రిపోర్టులు రాక
- డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామ బాధితుల నుంచి సేకరించిన రక్త నమూనాల పరీక్ష ఫలితాలు క్రమంగా వెలువడుతున్నాయని శుక్రవారం సాయంత్రం వరకు సుమారు 59 రక్త నమూనాల పరీక్షల ఫలితాలు వెలువడ్డాయని, అందులో బయో కెమిస్ట్రీ విభాగంలో వెలువడిన ఫలితాలలో అనుమానించదగినవిగా లేవని డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. రిపోర్టులన్నీ సాధారణ స్థాయి (నార్మల్)లోనే ఉన్నాయన్నారు. బ్లడ్ కల్చర్ రిపోర్టులు వెలువడేందుకు మరో 24 గంటల సమయం పడుతుందన్నారు. ఈ ఫలితాలు వస్తేనే తురకపాలెం గ్రామంలో ఇన్ఫెక్షన్‌కు దారి తీసిన కారణాలపై స్పష్టత వస్తుందని తెలిపారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న తురకపాలెం గ్రామానికి చెందిన ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. తురకపాలెం గ్రామంలో కొనసాగుతున్న 2 వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని, వీటి ద్వారా స్థానికులకు సీబీపీ, ఎల్ఎఫ్‌టీ(లివర్ పరీక్ష), ఆర్ఎఫ్‌టీ(కిడ్నీ), సీయూఈ రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరాలలో ఉన్న జనరల్ మెడిసిన్, మానసిక వైద్యులు, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యుల ద్వారా స్థానికులకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు.

వీవీఐటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన జర్మనీ బృందం



నంబూరు వీవీఐటీలోని సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రంలో జర్మనీ బృందం

పెదకాకాని: జర్మనీలోని అతి పెద్ద నైపుణ్య శిక్షణ సంస్థ డెక్రా అకాడమీ ప్రతినిధులు మండలంలోని నంబూరు వీవీఐటీ విశ్వవిద్యాలయంలోని సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర యువతలో నైపుణ్య కార్యక్రమాలను మెరుగుపరచడానికి, ప్రపంచ ఉపాధి అవకాశాలను సులభతరం చేసేందుకు గాను నియమితులైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (అంతర్జాతీయ నైపుణ్య, ఉద్యోగ కల్పన) సీతాశర్మతో కలసి శుక్రవారం యూనివర్సిటీని సందర్శించారు. విద్యార్థులకు అందించే శిక్షణ గురించి సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ రావెల నవీన్ బృందానికి వివరించారు. సీతాశర్మ మాట్లాడుతూ జర్మనీ ప్రస్తుతం నైపుణ్యం గల నిపుణుల కొరతను ఎదుర్కొంటోందని తెలిపారు. నిర్మాణం, ఇంజినీరింగ్, సమాచార సాంకేతిక వంటి రంగాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు. ఇండో జర్మన్ సమష్టి కృషితో యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు శిక్షణను అందించడం ద్వారా అంతర్జాతీయ నియామకాలు అందించవచ్చని సూచించారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి, ఎస్సీ విభాగాల కమిటీలు నియామకం

బాపట్ల టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు శుక్రవారం సాయంత్రం బాపట్ల జిల్లా విద్యార్థి, ఎస్సీ విభాగ కమిటీలను నియమించారు. విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా గోసాల అశోక్ (చీరాల), మాతి శివకుమార్ (వేమూరు)తోపాటు ఆరుగురు జనరల్ సెక్రటరీలు, ఏడుగురు సెక్రటరీలు, 15 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు. ఎస్సీ విభాగ కమిటీని నియమించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జడ విజయ్ బాబు (అద్దంకి), దున్నా బాబు (వేమూరు)తోపాటు ఏడుగురు జనరల్ సెక్రటరీలు, 18 మంది సెక్రటరీలు, నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఘటనాస్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. మృతుడు లేత ఆకుపచ్చ చొక్కా, తెలుపు మీద ఎరుపు, నలుపు గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద టర్కీ టవల్ ఉండడంతో రైతు అయి ఉంటాడని భావిస్తున్నారు. ఛిద్రమైన మృతదేహం భాగాలను తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ జి. వెంకటాద్రిబాబు సూచించారు.

గణేష్‌నిమజ్జనంలో అపశృతి

గుండెపోటుతో వ్యక్తిమృతి



బొల్లాపల్లి: వెల్లటూరులో శుక్రవారం జరిగిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌పార్టీ కార్యకర్త గంగసబోయిన గోవిందరాజులు (29) శుక్రవారం ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని గుండెపోటుతో కుప్పకూలిపోయి మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడు గోవిందరాజులుకు భార్య భూలక్ష్మి తోపాటు ఇరువురు సంతానం ఉన్నారు. మృతుని కుటుంబాన్ని స్థానిక వైఎస్సార్ పార్టీ నాయకులు పరామర్శించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలి

నరసరావుపేట: గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విద్యా సంస్కరణలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ మాట్లాడారు. మాజీ సీఎం జగన్ రూ.8,850 కోట్లతో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలకు చర్యలు తీసుకోగా అందులో ఐదింటిని పూర్తిచేసి తరగతులు కూడా ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు పావులు కదుపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందించడం ఇష్టంలేని ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కౌన్సిల్‌కు సీట్లు అవసరం లేదని లేఖ రాశారని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావటం తెలుగు రాష్ట్ర ప్రజల దురదృష్టకరం అన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వస్తే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే దుగ్ధతో చంద్రబాబు ఈ పాపానికి వడిగడుతున్నాడన్నారు. ఈ జీఓను వెనక్కి తీసుకోకపోతే పార్టీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోటపాటి మణికంఠారెడ్డి, బూదాల కల్యాణ్, ఉప్పతోళ్ల వేణుమాధవ్, బంటి, షోయబ్ పాల్గొన్నారు.

అప్పాపురం ఛానల్‌లో మునిగి యువకుడు మృతి



శైలేష్ (ఫైల్)

చేబ్రోలు: వినాయక విగ్రహ నిమజ్జనం కోసం వచ్చి అప్పాపురం ఛానల్‌లో ఈత కోసం దిగి ప్రమాదవశాత్తూ నీట మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన చేబ్రోలులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నల్లచెరువు గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ఎం. శైలేష్ (18) స్నేహితులతో కలిసి గురువారం రాత్రి గుంటూరు నుంచి చేబ్రోలు కొమ్మమూరు చానల్‌లో నిమజ్జనం కోసం బయలుదేరారు. మార్గంమధ్యలో అప్పాపురం ఛానల్ వద్ద మృతుడు శైలేష్ అతనితోపాటు మరో ఇరువురు స్నేహితులు ఆగి ఛానల్‌లో ఈత కోసం దిగారు. కొంత సేపు తరువాత అతని స్నేహితులు వరుణ్, షన్నులు శైలేష్ అప్పాపురం ఛానల్‌లో గల్లంతైన విషయాన్ని గమనించి కుటుంబసభ్యులకు తెలియజేశారు. రాత్రి సమయంలో గాలించినప్పటికి ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఛానల్ నీటి పరిమాణం తగ్గించి ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టడంతో మునిగిపోయిన కొంతదూరంలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నార

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు చంద్రగ్రహణం

వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



డాక్టర్ అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చంద్ర గ్రహణం పట్టిందని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ విమర్శించారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం లోపభూయిష్టంగా ఉందని అన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ము కాయడం చంద్రబాబునాయుడు నైజం అని మరోసారి రుజువైందన్నారు. చంద్రబాబునాయుడు పాలన అంటేనే ప్రైవేటు వ్యవస్థకి కేంద్ర బిందువని అన్నారు. దాదాపు 15 సంవత్సరాల కుపైగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఒక్క మెడికల్ కాలేజీ అయినా ఈ రాష్ట్రానికి తీసుకురాగలిగరా అని ప్రశ్నించారు. ఒక్కసారి ముఖ్యమంత్రి అయిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారని తెలియజేశారు. వాటిని చంద్రబాబు ప్రైవేట్ పరం చేయడానికి పూనుకున్నారని అన్నారు. ప్రజల కోసం పోరాటం చేయడానికి రాజకీయాల్లోకి వచ్చామని చెప్పే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీనిపై నోరు మెదపకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. అధికార పక్షంలో ఉండి మీరు ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం ఆలోచనకు స్వస్తి పలకాలని ఆయన కోరారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు నిఘా ఉంచామని తెలిపారు.

కూటమి నాయకుల వల్లే యూరియా కొరత

వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



వేమూరు: కూటమి నాయకుల నిల్వ చేసిన యూరియాను అదనపు ధరకు అమ్ముకునేందుకు కొరత సృష్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చెరుకుపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజనలో రైతులకు అరకొర యూరియా ఇవ్వడంతో రైతులు యూరియా కోసం నానా బాధలు పడుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీలో పెద్ద రైతులు యూరియా నిల్వ చేసుకున్నారని విమర్శించారు. చిన్న రైతులు, కౌలు రైతులు యూరియా కోసం సొసైటీల వద్ద పడిగాపులు కాస్తున్నారని అన్నారు. యూరియా కొరత వల్ల పంటకు సకాలంలో వేయకపోవడంతో దిగుబడులు తగ్గుతాయన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు, కౌలు రైతులకు సకాలంలో యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు.

ఎన్జీవో సంఘం జిల్లా కొత్త కమిటీ ఏర్పాటుకు కృషి

రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్



మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్

బాపట్ల:బాపట్ల జిల్లా ఎన్జీవో సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ పేర్కొన్నారు. బాపట్లలోని ఎన్జీవో అసోసియేషన్ హాలులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగస్తుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి.వి.రమణ, గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శ్యామసుందర్ శ్రీనివాస్, ప్రకాశం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అడహాక్ కమిటీ ఏర్పాటు

ఏపీ ఎన్జీవో బాపట్ల జిల్లా అడహాక్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా పి.నాగేశ్వర రావు, కన్వీనర్ గా బి.ప్రసాదరావు, ట్రెజరర్‌గా బి.రాజేష్, సభ్యులుగా డి.నాగేశ్వరరావు, సిహెచ్. శేషుబాబు, జి.కిరణ్ కుమార్, కే.సృజనకుమారిలను నియమించారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో ఉద్యోగుల సభ్యత్వ నమోదు పూర్తి చేసి బాపట్ల జిల్లా పరిధిలోని ఏడు తాలూకాలు బాపట్ల, చెరుకుపల్లి, రేపల్లె, చీరాల, అద్దంకి, పర్చూరు, మార్టూరు తాలూకాల ఎన్నికలను పూర్తిచేసి తరువాత నవంబర్ నెల చివరిలోపు బాపట్ల జిల్లా శాఖ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

రెండు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి





చీరాల రూరల్: రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం వేటపాలెం-చినగంజాం రైల్వేస్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. రైల్వే ట్రాక్‌మెన్ అందించిన సమాచారంతో సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం మూడో నంబర్ లైన్ పక్కన ఉందని.. ఎటువంటి వివరాలు లభించలేదని చెప్పారు. మృతుని వయస్సు వయస్సు 35 సంవత్సరాలు ఉంటాయని చెప్పారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మరో సంఘటనలో ...

వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఎస్. సత్యన్నారాయణ (75) అనే వృద్ధుడు తన భార్యతో కలిసి గురువారం సాయంత్రం చినగంజాం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం దాటుతున్నాడు. ఆ సమయంలో రైలు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కదిలిస్తే ఉబుకుతున్న క‘న్నీళ్లు’





క్వారీల గుంతల నుంచి సంపులోకి నీరు పంపింగ్ అవుతున్న పైప్‌లైను, మోటార్లు

- తురకపాలెం చుట్టూ అక్రమ నీటి విక్రయాలు
- ప్రజలకు మాత్రం క్వారీ గుంతలో నీళ్లు

గుంటూరు రూరల్: తురకపాలెం చుట్టూ అక్రమ నీటి విక్రయ కేంద్రాల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నా గ్రామస్తులకు మాత్రం చుక్క నీరు దొరకడం లేదు. క్వారీ గుంతల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామం నలువైపులా 20కి పైగా అక్రమ నీటి విక్రయ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 300 అడుగుల నుంచి 400 అడుగుల లోతు వరకూ బోర్లను ఏర్పాటు చేసి అక్రమార్కులు నీటి విక్రయాలను చేపడుతున్నారు. ప్రతి రోజు సుమారు 500 వందల ట్యాంక్‌ల నీటిని గుంటూరు నగరంలోని అపార్ట్‌మెంట్లు, పలు ప్రైవేటు కళాశాలలకు, హాస్టల్స్‌కు, నిర్మాణాలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం 40 లక్షల లీటర్ల విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ట్యాంకర్‌ను రూ. 1000 నుంచి రూ.1500 వరకూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

24 గంటలు నీటి తోడకం

బోర్లను 400 అడుగుల లోతు వరకూ ఏర్పాటు చేసి 24 గంటలు నీటిని తోడటంతో గ్రామస్తులు ఇళ్లలో వేసుకున్న బోర్లకు నీరు అందటం లేదు. గ్రామస్తులు 100 అడుగుల నుంచి 150 అడుగుల లోతు వరకూ మాత్రమే బోర్లను ఏర్పాటు చేసుకోవటంతో నీరందక అవస్థలు పడుతున్నారు. వేసవిలో నానా పాట్లు పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు మూగబోతున్నాయి. అనుమతులు లేకుండా భూగర్భ జలాలను విక్రయిస్తున్నా అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

ఐదు నెలల కిందట ఫిర్యాదు

గ్రామానికి సరఫరా చేస్తున్న నీరు మురికిగా వస్తోందని ప్రజలు ఐదు నెలల కిందట ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు.అయినా స్పందన లేదు. గత్యంతరం లేక క్వారీ గుంతల్లో నిల్వ చేసిన నీటిని వాడుకుంటున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్ వ్యర్థాలు, మురుగు నీరు కలిసి ప్రజలు చర్మవ్యాధులు, విషజ్వరాల బారిన పడుతున్నారు.

నీటి కాలుష్యంపై గ్రామంలో చర్చలు

గ్రామంలో ప్రస్తుతం ఉన్న బ్యాక్టీరియా నీటిని ట్యాంకుల ద్వారా నగర ప్రజలకు అమ్ముతున్నారని, ఆ నీటిని వినియోగిస్తున్నవారి పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అక్రమ సంపాదన కోసం నిర్వహిస్తున్న నీటి విక్రయాలను నిలిపి వేయాలని, తమకు మంచినీటిని అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు. గ్రామంలోని నీటిని ప్రజలకు అందించకుండా విక్రయాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువత భుజస్కంధాలపై భారత్ భవిత

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: భారత్ ఉజ్వల భవిత యువత భుజస్కంధాలపై ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నలంద, తక్షశిల వంటి విశ్వ విద్యాలయాల ద్వారా ప్రపంచ మానవాళికి జ్ఞానమందించిన ఘనమైన మన భారత సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. దేవుడిపై ఎంత భక్తి, గౌరవం ఉంటాయో, జ్ఞానాన్ని అందించే గురువుపై కూడా అంతే శ్రద్ధాభక్తులు ఉండాలని చెప్పారు. రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ మనం నేర్చుకున్న జ్ఞానం, నైపుణ్యాలను సరైన మార్గంలో నడిపించేవారే గురువని అన్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లబోతు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఏ వృత్తిలో రాణించాలన్న గురువుల పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జీవితంలో ఎంతో సాధించిన ప్రేరణాత్మకమైన వ్యక్తులను వారికి పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. వారి అనుభవసారాన్ని వినమ్రంగా గ్రహించి లక్ష్యసాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. తొలుత అతిథుల చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్, డాక్టర్ రమేష్, డాక్టర్ మురళిలను భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ సత్కరించారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి. అనంతరం అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు. భాష్యం అన్ని శాఖల్లోనూ వేడుకలు ఘనంగా జరిగాయి.